# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 02-04-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- రానున్న 50 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు.
- రాష్ట్రంలో బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు.
- వక్ఫ్ సవరణ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్ధతిస్తోందని బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ చెప్పారు.
- శాసన మండలికి ఇటీవల కొత్తగా ఎన్నికైన సభ్యుల చేత ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఈ రోజు ప్రమాణం చేయించారు.
- మునిసిపాలిటీలకు వచ్చిన ఆదాయాన్ని స్థానికంగా అభివృద్ధి కోసం వినియోగించుకోవచ్చునని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.

========================

రానున్న 50 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా తిరుమల తిరుపతి దేవస్థానాన్ని (టీటీడీ) తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. టీటీడీ పనితీరుపై అమరావతిలోని సచివాలయంలో ముఖ్యమంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తిరుమలకు వచ్చే భక్తులకు అందించే సేవలు, సౌకర్యాలు ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఆలయ పవిత్రతకు పెద్దపీట వేసేలా టీటీడీ కార్యాచరణ ఉండాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా గడచిన 9 నెలల కాలంలో వేంకటేశ్వర స్వామి వారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో తీసుకువచ్చిన మార్పులపై టీటీడీ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

========================

వక్ఫ్ సవరణ బిల్లుపై ఈ రోజు లోక్ సభలో చర్చ కొనసాగుతోంది. కేంద్ర మైనారిటీ సంక్షేమం పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజీ ఈ బిల్లు పై ముందుగా మాట్లాడారు. ఈ చర్చలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీకి చెందిన బాపట్ల పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.... వక్ఫ్ బిల్లుకు తెలుగుదేశం పార్టీ మద్దతు ఇస్తోందని చెప్పారు. ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని ఆయన పేర్కొంటూ..

(వాయిస్ 30 సెకన్లు)

========================

మునిసిపాలిటీలకు వచ్చిన ఆదాయాన్ని స్థానికంగా అభివృద్ధి కోసం వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విజయవాడలో ఈ రోజు జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... దీని వల్ల మునిసిపాలిటీలలో ప్రగతి కనిపిస్తుందని అన్నారు. అలాగే, స్వచ్ఛాంధ్ర కింద 50 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని.. మరో 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరించాలని చెప్పారు. ఆ విధంగా స్వచ్ఛాంధ్ర పేరుతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.

========================

రాష్ట్రంలో బయో గ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ప్రకాశం జిల్లాలో పీ.సీ.పల్లి మండలం దివాకరపల్లిలో కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్ (సీబీజీ) శంకుస్థాపన కార్యక్రమంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయని మంత్రి లోకేష్ పేర్కొంటూ..

(వాయిస్ 32 సెకన్లు)

========================

రాష్ట్ర శాసన మండలికి నూతనంగా ఎన్నికైన ఐదుగురు సభ్యుల చేత శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ఈ రోజు ప్రమాణం చేయించారు. శాసనసభ భవనంలోని ఛైర్మన్ చాంబరులో జరిగిన ఈ కార్యక్రమంలో సోము వీర్రాజు, బి.టి.నాయుడు, కొణిదల నాగేంద్ర బాబు, పేరాబత్తుల రాజశేఖర్, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సభ్యులుగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చన్నాయుడు, శాసనసభ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

========================

వచ్చే జూన్ నాటికల్లా హంద్రీనీవా ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విజయవాడ క్యాంపు కార్యాలయంలో ఈ రోజు హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో దృశ్య మాధ్యమం ద్వారా ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ ఏడాది బడ్జెట్ లో హంద్రీనీవా ప్రాజెక్టు కోసం 3 వేల 243 కోట్ల రూపాయలు కేటాయించినట్లుగా వివరించారు. రాష్ట్రాన్ని కరవు రహితంగా మార్చే కార్యక్రమం హంద్రీనీవాతోనే ఆరంభం కావాలని మంత్రి ఆకాంక్షించారు. కృష్ణా, గోదావరి జలాలను రాయలసీమకు తరలించడం ద్వారా ఆ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని రామారాయుడు చెప్పారు.

========================

గిరిజన గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేష ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాచిపెంట మండలం కేరంగి పంచాయతీ నందేదువలస నుండి కోదివలస వరకు సుమారు కోటి 25 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన బీటీ రహదారిని మంత్రి ఈరోజు

ప్రారంభించారు.  ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మారుమూల గ్రామాలలో మెరుగైన రవాణా, విద్య, వైద్య సదుపాయాలను అభివృద్ధి చేస్తామని అన్నారు.

విరామం

========================

రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు రేపటి నుండి ఈ నెల 5వ తేదీ వరకు మరలా 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. 6 సంవత్సరాల వయసు గల చిన్నారులందరి కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపింది.  ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు.

========================

విశాఖపట్నంలో యువతిపై ప్రేమోన్మాది దాడిలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఉండటంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దాడిని అడ్డుకునే ప్రయత్నంలో నిందితుడి చేతిలో యువతి తల్లి ప్రాణాలు కోల్పోవడం విచారకరం అన్నారు. యువతి ఆరోగ్య పరిస్థితిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి  ఆదేశించారు.

========================

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ  వ్యాధి వ్యాప్తిని నియంత్రించామని పశు సంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం, కోళ్ళ పెంపకదారులు సంయుక్తంగా సరైన చర్యలను తీసుకోవడం ద్వారా బర్డ్ ఫ్లూ వ్యాధిని అదుపులోకి తేగలిగామని చెప్పారు.  మార్చి నెలలో రాష్ట్రంలోని కోళ్లలో ఎక్కడా కూడా బర్డ్ ఫ్లూ వ్యాధి నమోదు కాలేదని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహ చెందవలసిన అవసరం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

========================

రాష్ట్రంలో లైసెన్సు ఫీజు, నాన్ రిఫండబుల్ రిజిస్ట్రేషన్ ఛార్జీలు, బిడ్ మొత్తాలను చెల్లించని బార్లను ఈ-వేలం ద్వారా ఔత్సాహికులకు కేటాయించేందుకు మద్య నిషేధ, అబ్కారీ శాఖ సంచాలకులు నోటిఫికేషన్ జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 44 బార్లను ఈ-వేలం, ఆన్ లైన్ లాటరీ పద్ధతిలో కేటాయిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.  బార్ల లైసెన్సులు తీసుకునేందుకు ఆసక్తి గల వారు ఈ నెల 1 నుంచి ఆన్ లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

========================

జిల్లాలో మలేరియా, డెంగ్యూ మరణాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ అధికారరులను ఆదేశించారు. కీటక జనిత వ్యాధుల నియంత్రణపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ రోజు సమన్వయ సమావేశం నిర్వహించారు.  ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మలేరియా ప్రభావిత ప్రాంతాలలో ప్రత్యేక దృష్టి పెట్టి నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

========================

జంతు సంరక్షణ సామాజిక బాధ్యత అని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు.  జంతువులపై క్రూరత్వ నివారణ చట్టం అమలుకు పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని తెలిపారు. జంతువులపై క్రూరత్వ నివారణ జిల్లా సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ రోజు దృశ్యమాధ్యమ విధానంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జంతు

సంరక్షణపై పాఠశాల స్థాయిలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

========================

రెవిన్యూకు సంబందించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని అనకాపల్లి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరం నుండి రెవిన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే, మ్యుటేషన్లు, ఇంటిస్థలాలు క్రమబద్దీకరణ, నీటితీరువా వసూలు తదితర అంశాలపై తహాశీల్దార్లతో జిల్లా కలెక్టరు ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఎస్.సి., ఎస్.టి. వినియోగదారులకు ఉచిత కరెంటు అందించేందుకు వారి ఇంటిపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయాలని కోరారు.

========================

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆ వివరాలను వాతారణ శాఖ అధికారి వెల్లడిస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

========================

========================